అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



జర్నలిస్ట్ వార్త కథనాలతో స్పందించిన నిర్వాహకులు 4

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -25 మంగళవారం 23 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# ఇందిరమ్మ రాజ్యం .. ఇంటింటా సంక్షోభం



**ప్రజలను విస్మరించి పార్టీ పెద్దల కోసం పాలన -బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు**

**హనుమకొండ,జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను ఆదుకుంటే... కాంగ్రెస్ నేతలు వారి పెద్దలను చూసుకుంటున్నారని, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్



# లక్నో కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



15 మంది సజీవ దహనం

**ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ**
**మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన**
**సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు**

**లక్నో : జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
భవిష్యత్ గురించి కలలు కంటూ ఉద్యోగ కలలను సాకారం చేసుకోవటానికి కోచింగ్ సెంటర్లలో చేరితేఉఅవి ప్రాణాలు తోడెస్తున్నాయి. సరిగ్గా రెండేండ్ల కిందట ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ లో జల సమాధి అయిన విషయం విదితమే. తాజాగా యూపీలోనూ ఓ కోచింగ్ సెంటర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసువులు బాశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్లో అమాంతంగా మంటలు ఎగిసిపడ్డాయి. **మిగతా 2లో...**

# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

**మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత**



**హైదరాబాద్,జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. **మిగతా 2లో...**

# సమాజ సేవకు చిరునామా

**బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవాల్లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు**
**అమరావతిలో 1000 పడకల ఆసుపత్రి ఏర్పాటును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు ప్రకటన**
**బాలకృష్ణ నాయకత్వంలో సంస్థ 'అన్‌స్టాపబుల్'గా దూసుకెళుతోందని కొనియాడిన చంద్రబాబు**

**హైదరాబాద్‌జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి చైర్మన్, తన బావమరిది అయిన నందమూరి బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "మొన్నటి వరకు సినిమాల్లోనే చప్పట్లు కొట్టించుకున్న బాలకృష్ణ, రేపటి రోజున సమాజ సేవలో ఎవరు మేటి అంటే దానికి చిరునామాగా నిలుస్తారు" **మిగతా 2లో...**




# రైల్వేమంత్రితో సీఎం భేటీ

**అపాయింట్‌మెంట్ ఇప్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**
**ఐఆర్ఎఫ్‌సీ రుణం ఇప్పించాలని విజ్ఞప్తి**
**పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రులతో**
**వరుస భేటీలుఢఢిల్లీలో సీఎం బిజీ బిజీ**

**న్యూఢిల్లీ,జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డు అని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో ఆయనతో కలిసి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. మెట్రోరైల్ ఫేజ్-2కు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) రుణాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారని సచివాలయంలో మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి ఫైర్ అయిన సీఎం సోమవారం అదే కేంద్రమంత్రి **మిగతా 2లో...**



# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

**జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు**
**ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ**
**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, (జర్నలిస్ట్ వార్త):**
రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ**2లో...**





# చర్చలు సానుకూలం

**ముగిసిన ఉన్నత స్థాయి సమావేశం**
**తుది ఒప్పందం కోసం కార్యాచరణ ప్రణాళిక**
**లెబనాన్‌లో ఘర్షణల నివారణకు సెల్ ఏర్పాటు**
**సాంకేతిక అంశాలపై సంప్రదింపులు ప్రారంభం**

**న్యూఢిల్లీజూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో ఆదివారం ప్రారంభమైన ఉన్నత స్థాయి చర్చలు సోమవారం ఉదయం ముగిశాయి. ఈ వారంలో సాంకేతిక స్థాయి చర్చలను కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. లెబనాన్‌లో జరుగుతున్న పోరును నివారించడానికి ఓ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం కుదిరింది. **మిగతా 2లో...**

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి**
**ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు**
**ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి**

**న్యూఢిల్లీ,జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, **మిగతా 2లో...**



# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**: ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష**
**జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు**

**హైదరాబాద్‌జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. **మిగతా 2లో...**



# లక్నో కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. రెప్పపాటులో మంటలు వేగంగా వ్యాపించి అదే భవనంలోని రెండో అంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్, సాఫ్ట్వేర్ ఆఫీసులను చుట్టుముట్టాయి. మంటల్లో చిక్కుకుని కోచింగ్ సెంటర్‌లోని పలువురు సజీవదహనం అయ్యారు. తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే ఈ అగ్ని ప్రమాదంలో మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 15కు పెరిగింది. ఇద్దరు చిన్నారులతో సహా ఏడుగురు గాయపడ్డారు. ప్రస్తుతం వారిని ఆస్ప త్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా మంటలు నుంచి తప్పించుకునేందుకు భవనంలోపల ఉన్న విద్యార్థులు కిందకు దూకేసిన దృశ్యాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏకంగా 14 ఫైర్ ఇంజిన్లు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్ వాహనంతో మంటలను ఆర్పివేశారు. భవనం లోపల దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో భవనం గోడను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. యూపీ ఉపముఖ్యమంత్రి బ్రిజేశ్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొందరు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని చెప్పారు. రెస్క్యూ సిబ్బంది ప్రతి గదిని, బాత్రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు.

**ప్రత్యక్ష సాక్షులు ఏం చెప్పారు?**

వాణిజ్య భవనంలో మొదట మూడో అంతస్తులో మంటలు అంటుకున్నాయి. అయితే చూస్తుండగానే అవి ఆఫీస్ మొత్తాన్ని చుట్టుముట్టాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్యాలయంలో 20 నుంచి 30 మందికి పైగా ఉండొచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో అక్కడ ఒక్కసారిగా తొక్కిసలాట, గందరగోళం ఏర్పడింది. భవనంలో పనిచేస్తున్న వారు, ఇతరులు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అటూఇటూ పరుగులు తీశారు. బయటకు రావడానికి ఎలాంటి దారులు కనిపించక పోవడంతో, పక్కనే వేలాడుతున్న ఒక వైర్ను పట్టుకొని కిందకు దూకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక యువతి సహా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని కార్యాలయం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ. 50వేలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. భవనంలో ఎంతమంది చిక్కుకున్నారు? ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**ప్రమాదంపై విచారణకు యోగి ఆదేశం**

మరోవైపు యూపీ రాజధానిలో అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే, సీఎం యోగి ఆదిత్యనాథ్ అలీగఢ్ పర్యటనను మధ్యలోనే ముగించుకొని లక్నోకు తెరిగి వచ్చారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకొని నివేదిక సమర్పించాలని డీజీపీ, హోంశాఖకు చెందిన అదనపు ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

**మొదటిపేజీ తరువాయి**

ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# సమాజ సేవకు చిరునామా

**మొదటిపేజీ తరువాయి**

అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రులు దామోదర రాజనర్సింహ, సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న నేపథ్యాన్ని, తన అత్తగారైన బసవతారకం గారు క్యాన్సర్‌తో పడిన బాధను చంద్రబాబు భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో క్యాన్సర్‌ను 'రాచపుండు' అనేవారని, సరైన వైద్య సదుపాయాలు లేక ఆమె ఎంతో వేదన అనుభవించారని తెలిపారు. ఆమె మరణం తర్వాత ఎన్టీఆర్ గారు తీవ్రమైన వేదనకు గురయ్యారని, పేదలకు శాశ్వతంగా ఒక మంచి ఆసుపత్రి కట్టాలనే ఆయన ఆలోచనే ఈ సంస్థకు పునాది వేసిందని వివరించారు.

ఆనాడు ఎన్టీఆర్ గారు ప్రభుత్వం తరపున భూమి కేటాయించినప్పటికీ, 1989లో ప్రభుత్వం మారడంతో ఆసుపత్రి నిర్మాణం ముందుకు సాగలేదని, మళ్లీ 1996-97 వరకు దానిపై దృష్టి పెట్టలేకపోయామని తెలిపారు. దివంగత కోడెల శివప్రసాదరావు, ఎన్ఆర్ఐల సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామన్నారు.

"తండ్రి ఒక మొక్క నాటితే, కొడుకుగా బాలకృష్ణ బాధ్యత తీసుకుని దాన్ని ఒక మహా కల్పవృక్షంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది" అని చంద్రబాబు కొనియాడారు. ఒకానొక దశలో సంస్థ మనుగడపైనే అనుమానాలు వచ్చినప్పుడు, 15 ఏళ్ల క్రితం బాలకృష్ణకు బాధ్యతలు అప్పగించామని, అప్పటి నుంచి ఈ వ్యవస్థను 'అన్‌స్టాపబుల్'గా ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. సినిమాల్లో ఎవర్ గ్రీన్ హీరోగా, హిందూపురం ఎమ్మెల్యేగా తీరిక లేకుండా ఉన్నప్పటికీ, క్యాన్సర్ రోగుల పట్ల ఆయన చూపే కరుణ, సేవ చేయాలన్న తపనే ఈ సంస్థను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు.

ప్రారంభంలో 100 పడకలతో మొదలైన ఆసుపత్రి, నేడు 650 పడకల స్థాయికి పెరిగిందని, 250 మందికి పైగా నిపుణులైన వైద్యులతో సేవలందిస్తోందని చంద్రబాబు వివరించారు. ఏటా 3 లక్షల మందికి పైగా ఔట్ పేషెంట్లకు, 90 వేల మంది ఇన్ పేషెంట్లకు సేవలు అందిస్తూ, సంవత్సరానికి 8,000 ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. అమరావతిలో 1000 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు బాలకృష్ణ, యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని, దాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని ప్రకటించారు.

ప్రభుత్వాలు మాత్రమే ప్రజారోగ్యాన్ని కాపాడలేవని, లాభాపేక్షతో నడిచే ప్రైవేటు ఆసుపత్రుల మధ్య, బసవతారకం వంటి లాభాపేక్ష లేని సంస్థలు (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్) మరిన్ని రావాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తల్లి పేరుతో బాలకృష్ణ, తండ్రి పేరుతో భువనేశ్వరి (ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్) సేవా కార్యక్రమాలు చేయడం ఎన్టీఆర్ కుటుంబం యొక్క విశిష్టత అని పేర్కొన్నారు. డబ్బు సంపాదించే అవకాశాలున్నా, పేదలకు సేవ చేయడంలోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారని అన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో రాబోయే 25 ఏళ్లలో బసవతారకం దేశంలోనే నంబర్ వన్ నాన్-ప్రాఫిట్ సంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పనికి విరాళాలు ఇవ్వాలనుకునే వారికి ఇది ఉత్తమ వేదిక అని సూచిస్తూ, 50వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ రాజ్యం ..ఇంటింటా సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి**

సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. కండలు తిరిగిన ఉస్తాదు అయినా మూడు నెలల్లోనే పిల్లలను పుట్టిస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని తెలుసని, కానీ 30 నెలల్లో పుట్టకపోతే ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో బూతుల మోతలు, పచ్చి అబద్దాలు తప్ప ఏమీ లేవని మాజీ మంత్రి విమర్శించారు. ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం తప్పదని మొదటినుంచీ చెబుతున్నామని అన్నారు. వంద సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి వంద పైసలైనా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. డబ్బుల సంచులన్నీ



ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఎగొట్టి, యూరియా కోసం లైన్‌లలో నిలబడే పరిస్థితికి రైతులను తీసుకొచ్చారన్నారు. 30 నెలల్లో వినాశనం జరిగిందని.. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

### చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

**ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా**

**వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక**

వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

# చర్చలు సానుకూలం

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు మధ్యవర్తిత్వ దేశాలైన పాకిస్తాన్, ఖతార్ విదేశాంగ శాఖలు ఓ ప్రకటనను విడుదల చేశాయి. అరవై రోజులలో తుది ఒప్పందం కుదుర్చుకోవడానికి వీలుగా ఓ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని ఆ ప్రకటన తెలియజేసింది. సంప్రదింపులు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని వివరించింది. చర్చలలో ఇరాన్, అమెరికా ప్రతినిధి బృందాలతో పాటు పాకిస్తాన్, ఖతార్ నేతలు కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం ఆయా దేశాల ప్రతినిధి బృందాలు స్విట్జర్లాండ్ నుంచి తిరుగుముఖం పట్టాయి. సాంకేతిక, నిపుణుల స్థాయి బృందాలు చర్చల ప్రక్రియను కొనసాగిస్తున్నాయి.ఆదివారం జరిగిన చర్చలలో చోటుచేసుకున్న కీలక పరిణామం ఏమిటంటే రాజకీయ పర్యవేక్షణతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా ఆంక్షలు, వివాదాల పరిష్కారం వంటి అంశాలపై తదుపరి సాంకేతిక చర్చలను తక్షణమే ప్రారంభించడానికి ఈ కమిటీ పునాది వేస్తుంది. లెబనాన్‌లో ఘర్షణల నివారణ కోసం ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం కూడా కీలకమైనదే. లెబనాన్‌లో ఘర్షణలను నివారించే విషయంలో ఈ సమావేశం మంచి పురోగతి సాధించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేశారు. ఇరాన్ చమురుపై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేసిందని, స్తంభింపజేసిన కొన్ని ఆస్తులను విడుదల చేసిందని చెప్పారు. ఇరాన్ పునర్నిర్మాణం-అభివృద్ధి ప్రణాళిక కూడా మొదలైందని అన్నారు. కాగా హార్ముజ్ జలసంధి కోసం 'లైన్ ఆఫ్ కమ్యూనికేషన్'ను ఏర్పాటు చేయడం జరిగిందని మధ్యవర్తులు తెలిపారు. రానున్న చర్చలలో భాగంగా దక్షిణ లెబనాన్‌లోని చిన్న చిన్న ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలిగే విషయంపై ప్రకటన చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని తెలుస్తోంది.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు.

కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# రైల్వేమంత్రితో సీఎం భేటీ

**మొదటిపేజీ తరువాయి**

కిషన్‌రెడ్డితో కలిసి అదే ఐఆర్ఎఫ్‌సీ రుణాన్ని త్వరగా మంజూరు చేయాలని రైల్వేమంత్రిని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై చర్చించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. రైల్వేమంత్రితో అపాయింట్‌మెంట్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ఇప్పించారని సమాచారం. ఇటీవలి కాలంలో సీఎం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అభివృద్ధి పేరుతో బీజేపీపై సీఎం చేస్తున్న విమర్శలు, రాష్ట్రంలో ఆపార్టీకి రెండోస్థానం కల్పించడం కోసమేననే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్న సమయంలో ఢిల్లీలో కిషన్‌రెడ్డి, సీఎం కలిసి రైల్వే మంత్రిని కలవడం చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ భూముల్ని రాష్ర ప్రభుత్వానికి బదలాయిస్తూ రక్షణ శాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఏఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే దేవరకద్రలో డీఆర్ డీవో ప్రాజెక్ట్ తో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ డెవలప్మెంట్ లో భాగమైన 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో (ఎంఆర్వో), హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయన్నాయని కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. ఈ విషయంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలమైందన్నారు. ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి సీఎం కోరారు. అలాగేడ తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

**మొదటిపేజీ తరువాయి**

ముందుకు సాగుతోందన్నారు. సోమవార రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు.

తంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# ఉపసర్పంచుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు రావాలి

### మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు తాళ్ల అరవింద్ గౌడ్



**భీమదేవరపల్లి/జూన్22 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల ఉపసర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ముల్కనూర్ గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "హలో ఉపసర్పంచ్ చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షులు అంబాల అనిల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గౌరవ వేతనం కల్పన, అధికారాల పరిరక్షణ కోసం చేపడుతున్న "హలో ఉపసర్పంచ్ చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉపసర్పంచులు పాల్గొని కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఉపసర్పంచుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షులు తాళ్ల అరవింద్ గౌడ్‌తో పాటు పలువురు ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు అందించాలి

### సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ ఆదరి శ్రీనివాస్



**భీమదేవరపల్లి/జూన్22 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల కేంద్ర పరిధిలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న భూమిలేని నిరుపేదలకు వెంటనే పట్టాలు మంజూరు చేసి, ఇంద్రమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ ఆదరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన సుమారు 500 మంది నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని, వీరంతా జీవో నెం.58 ప్రకారం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు పట్టాలు మంజూరు కాలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలకు భూ పట్టాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆదరి రమేష్, కొత్తపల్లి గ్రామ కార్యదర్శి బోడ బాలరాజ్, గట్ల నర్సింగాపూర్ గ్రామ కార్యదర్శి చుంచు కుమారస్వామి, బొల్లంపల్లి గ్రామ కార్యదర్శి సన్నిల్ల రవి, ఆరేపల్లి పుష్ప, ఆరేపల్లి కొమురయ్య, రాగుల చంద్రయ్య, మార్పు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

### -గార్ల బయ్యారం సిఐ.రవీందర్.




**బయ్యారం/,జూన్ 22.(జర్నలిస్ట్ వార్త)**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బయ్యారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గార్ల బయ్యారం సిఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ రవీందర్ మాట్లాడుతూ చెడు సావాసాల వైపు వెళ్లకుండా యువత తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు.గ్రామంలో, పాఠశాల పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగిస్తున్న వారి సమాచారాన్ని పోలీసులకు తెలుపాలన్నారు.ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు.యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.అనంతరం మాదకద్రవ్యాలకు,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన వాల్ పోస్టర్ ను విద్యార్థుల చేత ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# వంగరలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

### విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా మారాలి: వంగర ఎస్ఐ దివ్య





**భీమదేవరపల్లి/జూన్22 (జర్నలిస్ట్ వార్త):**
భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పి.వి.ఆర్. రెసిడెన్షియల్ పాఠశాల, జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో సోమవారం వంగర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో "డ్రగ్ ఫ్రీ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంగర ఎస్ఐ దివ్య తన సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థుల పాత్ర కీలకమని, ప్రతి విద్యార్థి "యాంటీ డ్రగ్ సోల్జర్"గా వ్యవహరించి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించి, డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో తెలంగాణ పోలీస్ శాఖతో పాటు ఈగల్ ఫోర్స్ చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1908 మరియు వాట్సాప్ నంబర్ 8712671111లను ప్రచారం చేశారు.




# భీమదేవరపల్లి కాంగ్రెస్ పగ్గాలు పోచంపల్లి రాజిరెడ్డి చేతికి

### కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు

**భీమదేవరపల్లి/జూన్22 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పోచంపల్లి రాజిరెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియామక ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా పోచంపల్లి రాజిరెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.



పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముల్కనూర్ గ్రామంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్న రాజిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్ష పదవిని అప్పగించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వానికి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం మండలంలోని ప్రతి గ్రామంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాత కమిటీల రద్దు.. కొత్త అధ్యక్షులకు స్వాగతం

### పార్టీ అభివృద్ధికి అండగా ఉంటాం: ఇంద్రసేనారెడ్డి

**ఎల్కతుర్తి,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు పాత కమిటీలను రద్దు చేసి కొత్తగా నియమితులైన అధ్యక్షులు, కమిటీలకు స్వాగతం పలుకుతున్నట్లు మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను మండల అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి కొత్త నాయకత్వానికి పూర్తి సహకారం అందిస్తామని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కొత్త కమిటీలు పార్టీని గ్రామస్థాయి



నుంచి మరింత బలోపేతం చేస్తాయనే నమ్మకం వ్యక్తం చేసిన ఆయన, కొత్త అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల విజయవంతం కోసం తమ వంతు సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జి కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకులకు ఇంద్రసేనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.కొత్త నాయకత్వం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# ముఖ్యమంత్రి సభ విజయవంతానికి శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి

### చింతకానిలో సభ ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**చింతకాని,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న రైతు సభ ఏర్పాట్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లకు అనువైన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు.జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాలలో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో



రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలను పకడ్బందీగా సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు.
సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా,



పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా బందోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించి పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.
సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# గోపి నగర్ బోర్డు వివాదానికి తెర

## జర్నలిస్ట్ వార్త కథనాలతో స్పందించిన నిర్వాహకులు

**వివాదాస్పద ప్రాంతాల నుంచి బోర్డుల తొలగింపు**

**గ్రామంలో నెలకొన్న ఉద్రిక్తతకు ముగింపు**

**-పత్రికకు గ్రామస్తుల అభినందనలు**



### ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన 'గోపి నగర్' బోర్డు కలకలం

సర్పంచ్, కార్యదర్శికి గ్రామస్తుల ఫిర్యాదు.. ధర్మసాగర్‌లో ఉద్రిక్తత

ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూన్ 17 (జర్నలిస్ట్ వార్త)ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన 'గోపి నగర్' బోర్డు కొత్త వివాదానికి తెరలేపింది. ప్రభుత్వ ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా బోర్డు ఏర్పాటు చేశారంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.గ్రామస్తుల కథనం ప్రకారం.. ఒక కాలనీకి పేరు నిర్ణయించడం, బోర్డు ఏర్పాటు చేయడం వంటి అంశాలకు గ్రామపంచాయతీతో పాటు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. అయితే నిబంధనలను పక్కనపెట్టి ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో, అలాగే స్నేహ కాలనీలో 'గోపి నగర్' పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల పక్కన అనుమతులు లేకుండా బోర్డులు ఏర్పాటు చేయడం సరైన విధానం కాదని, వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ అంశం గ్రామంలో తీవ్ర చర్చకు దారితీయగా, రెండు వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బోర్డులను తొలగించడంలో అధికారులు ఆలస్యం చేస్తే గ్రామంలో ఘర్షణాత్మక పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పకముందే అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**కార్యదర్శి స్పందన కరువు**

ఈ వ్యవహారంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా, "రేపు మాట్లాడతాను" అని చెప్పి ఫోన్ పెట్టేశారు దీంతో ఈ వివాదంపై అధికారుల వైఖరి ఏమిటన్నది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.



### గోపి నగర్ బోర్డులపై కొనసాగుతున్న వివాదం

స్నేహ కాలనీలోని బోర్డు తొలగించిన స్థానికులు

ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కనున్న బోర్డుపై పంచాయతీ చర్యల కోసం ఎదురుచూపులు

ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులపై విమర్శలు

ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూన్ 19 (జర్నలిస్ట్ వార్త)హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని స్నేహనగర్‌లో "గోపి నగర్" పేరుతో ఏర్పాటు చేసిన రెండు బోర్డులు గ్రామంలో వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు బోర్డులు ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక బోర్డు స్నేహ కాలనీలో, మరొకటి ఎస్సీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ గోడ పక్కన ఏర్పాటు చేసినట్లు చేశారు ఈ విషయమై గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. దీంతో శుక్రవారం స్నేహ కాలనీ ప్రజలే ముందుకొచ్చి తమ కాలనీలో ఏర్పాటు చేసిన గోపి నగర్ బోర్డును తొలగించారు. అయితే ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన ఏర్పాటు చేసిన మరో బోర్డు ఇప్పటికీ అలాగే ఉండటంపై గ్రామంలో చర్చ జరుగుతోంది. స్నేహ కాలనీలోని బోర్డును ప్రజలు తొలగించిన నేపథ్యంలో, ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కనున్న బోర్డును గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు ఎప్పుడు తొలగిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్డుపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

**మౌనం వెనుక కారణాలేమిటి..?**

ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డుల విషయంలో పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ధర్మసాగర్ చరిత్రను కాపాడాలని డిమాండ్** చారిత్రక ప్రాధాన్యం కలిగిన ధర్మసాగర్ గ్రామంలో ఎవరికి వారుగా కొత్త పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడం సరికాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ చరిత్ర, గుర్తింపును దెబ్బతీసే చర్యలను అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్డులపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వివాదానికి




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారిన గోపి నగర్ బోర్డుల వివాదానికి ఎట్టకేలకు శాంతియుతంగా తెరపడింది. ఎస్సీ కమిటీ హాల్ సమీపంలో, స్నేహ కాలనీలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు 'గోపి నగర్' పేరుతో బోర్డులు ఏర్పాటు చేయడంతో గ్రామంలో తీవ్ర చర్చ సాగింది. ఈ అంశంపై 'జర్నలిస్ట్ వార్త' పత్రిక వరుస కథనాలు ప్రచురించడంతో సమస్య ప్రజల దృష్టికి వెళ్లడమే కాకుండా సంబంధిత వర్గాల్లో చైతన్యం కలిగించింది.
వార్తా కథనాల నేపథ్యంలో బోర్డులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వివాదాస్పద ప్రాంతాల్లో ఉన్న బోర్డులను తొలగించారు. అనంతరం ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రాంతాల్లోనే వాటిని ఏర్పాటు చేసుకోవడంతో సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం లభించింది. దీంతో గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణం పూర్తిగా చల్లారిపోయింది.
వివాదం ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళనలో ఉన్న గ్రామస్థులు సమస్య సద్దుమణగడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి మార్గం సుగమం చేసిన జర్నలిస్ట్ వార్త పత్రిక పాత్రను గ్రామస్తులు ప్రశంసించారు. పత్రిక కథనాల వల్లే వివాదం మరింత ముదరకుండా ప్రశాంతంగా ముగిసిందని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలో సామరస్య వాతావరణం కొనసాగాలంటే భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టే ముందు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గ్రామ పెద్దలు సూచించారు. ప్రజల మధ్య విభేదాలకు తావివ్వకుండా పరస్పర అవగాహనతో వ్యవహరించడం ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర ఎంత కీలకమో 'గోపి నగర్' బోర్డు వివాదం మరోసారి రుజువు చేసింది





ఎస్సీ కమిటీ హాల్ పక్కన గతంలో గోపి నగర్ పేరుతో ఏర్పాటుచేసిన బోర్డు



స్వచ్ఛందంగా గోపి నగర్ బోర్డ్ తొలగింపు

## కడుపులో 4 కిలోల కంతి.. విజయవంతంగా తొలగించిన వైద్యులు





**నర్సంపేట, /జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళ కడుపులో నాలుగు కిలోల బరువున్న భారీ కంతిని వైద్యులు విజయవంతంగా తొలగించారు. నర్సంపేట పట్టణంలోని వెంకటేశ్వర హాస్పిటల్‌లో ఈ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు.గుండాల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సుజాత (49) కొంతకాలంగా కడుపునొప్పితో ఇబ్బందులు పడుతుండగా చికిత్స కోసం వెంకటేశ్వర హాస్పిటల్‌ను ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గర్భసంచి వద్ద భారీ కంతి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించి గర్భసంచితో పాటు సుమారు నాలుగు కిలోల బరువున్న కంతిని తొలగించింది.శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ మృత్యుంజయుడు, డాక్టర్ జగదీష్, డాక్టర్ యు.సంపత్, డాక్టర్ వజసాగర్, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు

## పేదల గుడిసెల తొలగింపుపై సీపీఐ ఆందోళన

**తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ**





**ఎల్కతుర్తి,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ మండలం గుండ్లసింగారం గ్రామంలో పేదలు నిర్మించుకున్న గుడిసెల తొలగింపు ఘటనపై సీపీఐ నాయకులు సోమవారం ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రసాద్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రే లక్ష్మణ్, మండల కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గుండ్లసింగారంలో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు జేసీబీలతో తొలగించారంటూ ఆరోపించారు. ముందస్తు సమాచారం లేకుండా, మహిళలు, చిన్నారులు ఉన్న సమయంలో ఇలాంటి చర్యలు చేపట్టడం బాధాకరమని పేర్కొన్నారు.
పేదలకు నివాస హక్కు కల్పిస్తామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గుడిసెల తొలగింపు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు, వారికి ప్రత్యామ్నాయ నివాస సదుపాయం కల్పించాలని కోరారు.
ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచించి బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.
కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిర్మల మనోహర్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు తండ మొండయ్య, మంతుర్తి మల్లయ్య, మోహన్‌రెడ్డి, వేముల కుమారస్వామి, వేముల కృష్ణకర్, ఎర్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల మామూళ్ల మత్తు..

## పడగవిప్పుతున్న గంజాయి, బెల్టు షాపులు!

**వర్ధన్నపేట/జూన్ 23(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్టు షాపులు, గంజాయి దందా యథేచ్ఛగా సాగుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. మంగళవారం ఆయన వరంగల్ జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం, రాయపర్తి మండలాల్లోని మద్యం దుకాణాల నిర్వాహకుల నుంచి ఎక్సైజ్ సీఐ, ఇతర సిబ్బంది తమ కారు డ్రైవర్ ద్వారా నెలకు రూ. 4.50 లక్షల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వందకు పైగా గ్రామాల్లో దాదాపు 200 వరకు బెల్టు షాపులు నడుస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అర్ధరాత్రి వరకూ మద్యం లభిస్తుండటంతో యువత మద్యానికి బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని, పత్రికల్లో వార్తలు వస్తున్నా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మద్యమే కాకుండా, గుడంబా విక్రయాలు, పటికబెల్లం సరఫరాదారులతోనూ అధికారులకు ఒప్పందాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా గంజాయి స్మగ్లర్లతో కుమ్మక్కై అధికారులు కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, అక్రమ దందాలకు సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై సమగ్ర విచారణ జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల కుమార్, రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



★NATIONAL MADIGA RAJAKEEYA PORATA SAMITHI (MRPS)
NATIONAL COMMITTEE (BNR) (Regd. No. 270/2022)
National Office : H.No. 1-1-652/K/30, Arundhathi Nagar, Gandhinagar, Musheerabad, Hyderabad - 500 020. Telangana State.
Ph : 9346439329, 7675974556, E-mail: bnrmadigamrps1966@gmail.com

ERELLI.SRINIVAS MADIGA
MRPS. Rastra Politburo Sabyudu
Cell :8106607170 Wardhannapet

Date : 23-6-2026
Place :

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ వరంగల్ గారికి దివ్యసముకమునకు.

ఆర్యా!

విషయం: వర్ధన్నపేటలో 4 బ్రాండి(వైన్స్) షాపులు,పర్వతగిరిలో 4 బ్రాండి(వైన్స్) షాపులు, సంగెంలో 3 బ్రాండి (వైన్స్) షాపులు,రాయపర్తిలో బ్రాండి (వైన్స్) షాపులు, ఉన్నాయి ఎక్స్ ఛ ,సిఐ అధికారులు ప్రతినెల వల్ల కారు డ్రైవరుతో కమిషన్ 4,50,000/-రూపాయలు మామూలు తీసుకుంటూ ఎలాంటి దందాలు జరిగిన పట్టించుకొని పరిస్థితి గంజాయి స్మగ్లర్ల కుమ్మక్కై చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి దందాలకు సపోర్ట్ చేస్తున్న ఎక్స్ ఛ అధికారులపై సమగ్ర విచారణ జరిపించుట గురించి.

నేను అనగా ఈరెల్లి శ్రీనివాస్ S/o పోషయ్య గ్రా॥ వర్ధన్నపేట, (మున్సిపాలిటీ ) కోనపురం, 7వ డివిజన్, మం॥ వర్ధన్నపేట, జిల్లా వరంగల్ నివాసియున్ని తెలుపుకొను మనవి ఏమనగా విషయంలో తెలిపిన వివిధ మండల పరిధిలో ఉన్న బ్రాండి ఉన్న గ్రామాలలో మినిమము ఒక్క గ్రామంలో 200 వరకు బెల్టు షాపులు ఈ చొప్పున మినిమము 100 గ్రామాలుంటాయి. గ్రామాలలో యువకులకు అర్ధరాత్రి అయిన మందు దొరకడంతో మద్యానికి బానిసై యువకులు చనిపోవడంతో, ఆయా కుటుంబాలు బజారున పడుతున్నాయి. ఇట్టి విషయం ప్రతిరోజు మత్తు మందుతో చనిపోయిన యువకులు అని పత్రికలలో వచ్చిన కూడా ఎక్స్ ఛ అధికారులు చూసి చూడనట్లు ఉండడము బడకరము.

బెల్టు షాపులు నియంత్రించాలని ఇటీవల వివిధ దిన పత్రికలలో వెలువడిన కథనాలకు అధికారులు ఎందుకు స్పందించడం లేదు. వీరికి ఏమి సంబంధం లేదా వైన్స్ షాపుల ఓనర్లు, బెల్టు షాపుల నిర్వాహకులతో ఏమైనా లావాదేవీలు ఉన్నాయా అనే విషయమును స్పష్టంగా తెలియచేస్తున్నాయి. ఎక్స్ ఛ అధికారులు ఎందుకు చూసి చూడనట్లు వ్యవహరిస్తునారో తమరు వీరిపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇదే కాకుండా పటిక బెల్లం సప్లయి చేసే నిర్వకులతో కూడా వీరికి ఒప్పందాలు ఉన్నాయి ఇప్పటికే కూడా గుడంబా విచ్చల విడిగా కొనసాగుతుంది(?). గంజాయి స్మగ్లర్ల కూడా ఎక్స్ ఛ అధికారులకు సంబంధాలు ఉన్నాయి. గంజాయి స్మగ్లింగ్ చేసే వారితో బంధాలు ఏర్పరచుకొని కోట్లకు పడగలెత్తారు.

కావున దయతలచి వర్ధన్నపేట మండల కేంద్రంలో గుడంబాను నియంత్రించక పోవడం విచారకరం కాబట్టి ఎక్స్ ఛ అధికారులపై సమగ్ర విచారణ జరిపించి ప్రజల బాగోగులు కాపాడాలని కోరుకుంటూ విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు
తమ విధేయుడు
ఈరెల్లి శ్రీనివాస్(మాదిగ)
MRPS రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు
వర్ధన్నపేట(మున్సిపాలిటీ )జిల్లా వరంగల్
సెల్ నెం : 8106607170

Kumar
గద్దల కుమార్ (మాదిగ )
MRPS రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (9550822740)
మరుపట్ల అంజయ్య (మాదిగ )
MRPS రాష్ట్ర కార్యదర్శి (8186828114)

22 JUN 2026

# నెహ్రూ విగ్రహం తరలింపుపై ఆందోళన


**యథాస్థలంలోనే కొనసాగించాలని కాలనీవాసుల డిమాండ్**

**అధికారులకు వినతిపత్రం.. చారిత్రక గుర్తింపును కాపాడాలని విజ్ఞప్తి**






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ గ్రామంలోని నెహ్రూ కాలనీలో దాదాపు ఐదు దశాబ్దాలుగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం భవితవ్యంపై కాలనీవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామానికి, కాలనీకి గుర్తింపుగా నిలిచిన విగ్రహాన్ని ప్రస్తుత స్థలం నుంచి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారంతో స్థానికులు అధికారులను ఆశ్రయించారు.
సోమవారం కాలనీవాసులు తహసీల్దార్ ఇస్లావత్ భావ్‌సింగ్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌లకు వినతిపత్రం సమర్పించి విగ్రహాన్ని యథాస్థలంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహం కేవలం ఒక శిల్పం మాత్రమే కాదని, తరతరాలుగా కాలనీ ప్రజల భావోద్వేగాలకు, చరిత్రకు ప్రతీకగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. ఇటీవల సమీప ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో, అలాగే ప్రతిపాదిత డ్రైనేజీ పనులను కారణంగా చూపుతూ విగ్రహం స్థానాన్ని మార్చే యత్నాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వకుండా విగ్రహం తరలింపు అంశం తెరపైకి రావడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశాల్లో అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, అభివృద్ధి పనుల పేరుతో చారిత్రక గుర్తింపులను చెరిపివేసే పరిస్థితి రాకూడదని స్థానికులు కోరుతున్నారు. విగ్రహం ఉన్న ప్రదేశాన్ని రక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.
కాలనీవాసుల వినతిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుని వివాదానికి తెరదించాలని స్థానికులు కోరుతున్నారు.



తేదీ: 22-06-2026



# జాతీయ యువ పార్లమెంట్‌లో అఖిలకు ప్రథమ స్థానం

## స్వగ్రామంలో ఘన సన్మానం.. అభినందనల వెల్లువ





**వైరా,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'వికసిత్ భారత్ యువ పార్లమెంట్2026'లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన నారపనేనిపల్లి గ్రామానికి చెందిన కనకపూడి అఖిలకు స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి స్వగ్రామానికి చేరుకున్న అఖిలను గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు.
గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు అఖిలకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల గ్రామానికి చెందిన అఖిల జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గ్రామానికే గర్వకారణమన్నారు. ప్రజాస్వామ్య విలువలను యువతలో పెంపొందించేందుకు నిర్వహించిన యువ పార్లమెంట్‌లో అఖిల తన వాక్చాతుర్యంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకోవడం విశేషమన్నారు.
అఖిల మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన తాను కష్టపడి చదువుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపింది. తన విజయానికి తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహమే కారణమని పేర్కొంది. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి గ్రామానికి, సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది.
కార్యక్రమంలో ఫాదర్ విజయరాజు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని అఖిలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి, జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన అఖిలను పలువురు ఆదర్శంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ముప్పు శ్రీనివాస్ ఏకగ్రీవం





**ఎల్కతుర్తి,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ముప్పు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పార్టీ నాయకత్వం వివిధ అంశాలపై చర్చించి ఆయన పేరును ఖరారు చేసినట్లు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఈనుగాల వెంకటరామిరెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి భోజపురి అశోక్ ముఖర్జీ, పెద్ది వెంకట్ నారాయణ గౌడ్ తదితర నాయకుల సమక్షంలో ముప్పు శ్రీనివాస్‌ను మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు శనిగరం రాజ్‌కుమార్, డాక్టర్ రమేష్‌బాబు, శీలం నీల్‌కుమార్, ఉప్పు శ్రీనివాసులు తదితరులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అధ్యక్ష బాధ్యతల స్వీకరణ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఈనుగాల వెంకటరామిరెడ్డి ఆశీస్సులతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.
మండలంలోని సీనియర్, జూనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పనిచేస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత పాత్ర కీలకం





## - ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి

**నేలకొండపల్లి, జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**
మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్ అభియాన్” వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.డి. సమ్రీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సమ్రీన్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమం లక్ష్యాలు, బాలికల విద్య, భద్రత, సాధికారత అంశాలను వివరించారు.మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం అందుబాటులో ఉన్న వివిధ హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు “నషా ముక్త్ భారత్ అభియాన్” అంశంపై వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ఆరోగ్యకర జీవన విధానం, మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.జెండర్ స్పెషలిస్ట్ పి. ప్రమీల మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలు, బాలికల రక్షణ, విద్య, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మానస మాట్లాడుతూ యువత తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రమేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో నేడు విత్తన మేళా

## హాజరుకానున్న జిల్లా కలెక్టర్ చౌహాన్ బాజ్‌పేయి

**ఎల్కతుర్తి/, జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఏడు రోజులపాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ చౌహాన్ బాజ్‌పేయి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.విత్తన మేళా ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సాగు పద్ధతులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా రైతులకు ఒకే వేదికపై ఏడు రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉంచనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, ఏఈఓ పున్నం చందర్ వెల్లడించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు అవసరమైన విత్తనాలను పొందాలని వారు కోరారు.విత్తనాల ఎంపిక, దిగుబడి పెంపు, వర్షాకాల సాగుకు అనుకూలమైన రకాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

# మానసిక దివ్యాంగులకు అన్నదానం




**మధిర,/ జూన్ 22 (జర్నలిస్ట్ వార్త):** మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాలపర్తి ప్రభాకర్‌రావుమధువాణి మనవరాలు, ప్రణీత్ చంద్రఅలేఖ్యల కుమార్తె చిరంజీవి పాలపర్తి తారా ప్రణీత్ (ప్రైసీ) పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు భోజన వితరణ చేసి, తారా ప్రణీత్ జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. చిన్నారి తారా ప్రణీత్ విద్యలో రాణిస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేంద్ర నిర్వాహకులు, దివ్యాంగ పిల్లలు ఆకాంక్షించారు.కేంద్రానికి నిరంతరం సహకారం అందిస్తూ, దివ్యాంగ పిల్లల సంక్షేమానికి తోడ్పాటునందిస్తున్న పాలపర్తి ఉషారాణిని నిర్వాహకులు అభినందించారు. పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగ పిల్లలతో ఆనందాన్ని పంచుకుంటూ అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ప్రణీత్ చంద్ర, అలేఖ్య కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి తారా ప్రణీత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# యూరియా యాప్ రద్దు చేయాల్సిందే!

## అన్నదాతల సమస్యలపై వర్ధన్నపేటలో సీపీఐ నిరసన తహసీల్దార్‌కు వినతి!




**వర్ధన్నపేట/ జూన్ 23(జర్నలిస్ట్ వార్త):** రైతు సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ విజయసాగర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు మాట్లాడుతూ.. తెలంగాణలో విపరీతంగా పెరిగిన ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాలు, వ్యవసాయ పెట్టుబడి వ్యయాన్ని పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా నిధులను ఆలస్యం చేయకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. ప్రస్తుతం కొత్తగా తీసుకొచ్చిన 'యూరియా యాప్' వల్ల క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాంకేతిక సమస్యలతో ఇబ్బంది పెడుతున్న ఆ యాప్‌ను రద్దు చేసి, గతంలోలాగే నేరుగా యూరియా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి గ్రామ కార్యదర్శి తాటికాయల మహేందర్, దామన్నపేట కార్యదర్శి చెక్క మహేందర్, పార్టీ నాయకులు డొంక ఐలయ్య, యాకూబ్, ఆరెల్లి ప్రభాకర్, సత్తుపల్లి యాకయ్య, పొన్నాల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (ఇూ) ఎం. వెంకన్న ఘోర మరణం చెందిన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది.
వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు.ప్రమాదం వివరాల్లోకి వెళితే... ఈ ఉదయం గణపురం మండలం చెల్పూరు శివారులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా బొగ్గు లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ వెంకన్నపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.